# పితృత్వం



**గత పదిహేను రోజులుగా నా మనసులో వున్న సందేహాన్ని డాక్టర్ కన్‌ఫాం చేసింది- నేను గర్భవతిని అని. రెండో నెల నిండుతోందని. వార్త వినగానే నా భర్త మొహం వెలిగిపోయింది.**

**అతని ఆనందం చూసి నాకూ కాసింత గర్వంగా అన్పించింది. నేనో అద్భుతాన్ని ఆవిష్కరించబోతున్నాను కదాని.**

**అప్పట్నించీ నా భర్త చంద్రశేఖర్ నన్ను మరింత అపురూపంగా చూడసాగాడు. దాంతో నేను ఓ ప్రత్యేకమైన వ్యక్తిని అన్న భావం బలపడుతుండేది.**

**దానికితోడు ఏ పుస్తకం చదివినా, టి.వి. చూసినా సినిమా చూసి నా మాతృత్వపు గొప్పదనం గురించీ, ఆడవాళ్ళు తమ బిడ్డల కోసం చేసే త్యాగాల గురించీ రకరకాల సంఘటనలు వుండేవి. అవి మనసుని ఉత్సాహభరితం చేసేవి.**

కథ

## కె.ఎన్.మల్లీశ్వరి

నాకు ఏడో నెల నిండింది... యింకో నెలాగి, చేసే ప్రయివేటు లెక్చరర్ ఉద్యోగానికి కొన్నాళ్లు శెలవు పెట్టాలనుకున్నాను.

అలాంటి సమయంలోనే క్రమంగా నాలో మార్పు రావడం ప్రారంభమయింది. విచిత్రంగా ఆ మార్పుని వేరెవరో గుర్తించి చెప్పలేదు. నాకు నాకే తెలుస్తోంది. ఇదివరకులా పుట్టబోయే బిడ్డని తలుచుకుంటే మాతృగర్వంతో పులకరింతలు రావడం లేదు సరికదా బిడ్డని నేను సక్రమంగా పెంచగలనా అని భయం పట్టుకుంది.

ఎందుకంటే పిల్లల పెంపకం మీద నాకు కొన్ని స్థిరమయిన అభిప్రాయాలున్నాయి. పిల్లల్ని కొట్టకూడదు, మంచి మాటలతోనే వారికి క్రమశిక్షణ నేర్పాలి, మనమే వారి ప్రపంచంలోకి వెళ్ళి వారి కష్టసుఖాలని అర్థం చేసుకుని తదనుగుణంగా మెలగాలి... మొదలైనవి.

"నారు పోసినవాడే నీరు పోస్తాడన్న' మూఢనమ్మకం నాకు లేదు. ఆలోచించేకొద్దీ పిల్లల్ని పెంచడం అంత సులువుకాదు అన్న విషయం నాకు బోధపడింది.

ఉదయం యింట్లో పనులు చేసుకుని కాలేజికి వెళ్ళి అక్కడ పిల్లల్ని సక్రమంగా తీర్చిదిద్దే కార్యక్రమం నిర్వహించి మళ్ళీ సాయంత్రం యింటికొచ్చి మళ్ళీ యింటి పనులు ముగించి వ్యక్తిగత సరదాలకి సమయం వుండటం లేదే అని బాధపడుతున్న ఈ తరుణంలో తను బిడ్డకి జన్మనిస్తోంది. తను సరిగా పెంచలేదేమోనని భయం కలిగేది.

ఈ భయం తనలో ఆత్మవిశ్వాసం లోపించడం వల్ల కలిగిన భయం కాదు. పిల్లల్ని పెంచడం ఎంత క్లిష్టతరమైన బాధ్యతో గుర్తించడం వలన కలిగిన భయం.

ఎవరితోనన్నా చర్చిస్తే యింత చిన్న విషయానికా? లోకంలో అందరూ కనడం లేదా? నువ్వొక్కదానివే కంటున్నావా? అని వేళాకోళం చేస్తారని తెలుసు. ఈ దిగులు మనసులో అంతర్గతంగా పెరిగిపోతుండగా ఓ రోజు పక్కింటి గీత వచ్చింది. తను కలెక్టరాఫీసులో క్లర్కుగా చేస్తోంది. వాళ్ళాయన పేరుమోసిన బాంక్‌లో మేనేజర్‌గా చేస్తున్నాడు. వాళ్ళకి నాలుగేళ్ళ బాబు వున్నాడు. గీత కూడా ఇప్పుడు గర్భవతి.

వాళ్ళ దాంపత్యం చాలా అన్యోన్యంగా సాగుతున్నట్లుగా అందరికీ అన్పించేది. వాళ్ళ బాబు మేనర్స్ చూస్తే చాలా ముచ్చటేస్తుంది. బైటకి వస్తే ఎంతో బుద్ధిగా, అల్లరి చేయకుండా వుంటాడు. క్లాసులో వాడిదే ఫస్ట్ రాంక్ అట.

గీతని లోనికి ఆహ్వానించి సోఫాలో కూర్చోబెట్టాను. "ప్రశాంతీ! రేపు రాత్రికి సిటీకేబుల్‌లో మా వారి గురించిన పరిచయ కార్యక్రమం టెలీకాస్ట్ అవుతుంది. లయన్స్ క్లబ్ వారు ఈ మధ్య ఈయనకి అవార్డ్ యిచ్చారు కదా! అందుకని ఈప్రోగ్రాం ఎరేంజ్ చేశారు. నేనూ, బాబు కూడా వున్నాం" మొహమాటపడుతూ చెప్పింది.

తప్పకుండా చూస్తానని చెప్పి పంపించాను.

మర్నాటి రాత్రికి చందూని కూడా కూర్చోబెట్టి ఆ ప్రోగ్రాం చూపించాను. ఆ ప్రోగ్రాంలో ఆయన ఎంతో గంభీరంగా భార్యా, బిడ్డల మీద అవ్యాజానురాగంతో మాట్లాడారు.

తను సాధించిన ఈ విజయం వెనుక వున్నది తన భార్యేననీ, యింటి పనులూ, బయటి పనులూ, బాబు పెంపకం వాడి చదువూ తన భార్య చూసుకోవడం వల్లే తనిదంతా సాధించానని ఆయన ఒక్క మాటలో క్రెడిట్ అంతా భార్యకే యిచ్చేశాడు.

ఇతను ఒక్కడే కాదు సమాజంలో విజయం సాధించిన చాలామంది మగాళ్ళకి యింట్లో పనులు గానీ, బిడ్డల పెంపకం గురించి ఏమీ తెలీదు. అదంతా భార్యలే చూసుకుంటారని ఇలాంటి కార్యక్రమాల్లో ప్రముఖులు చెప్పగా వింది.

అప్పటినుంచీ మరీ దిగులు ఎక్కువైంది. ఇపుడు చందూ విజయం సాధించాలంటే ఇవన్నీ నేనొక్కదాన్నే చూసుకోవాలి. 'మరి నువ్వు విజయం సాధించాలంటే' అని నా మనసు ఓ కొంటె ప్రశ్న వేసిందంటే తప్పు నాది కాదు.

చివరికి ఓరోజు ఆపుకోలేక నా సందేహాలన్నీ చందూకి చెప్పాను. ఇవన్నీ కొత్తగా అన్పించాయో ఏమో తెల్లమొహం వేశాడు. చివరికి తేరుకుని–

"మరి లోకంలో అందరూ మాతృత్వపు గొప్పదనం గురించి చెపుతున్నారుగా! తల్లి క్రమశిక్షణలో పెరిగిన పిల్లలే గొప్ప వాళ్ళవుతారని. ఎంతోమంది చదువలేని వాళ్ళూ,

మూఢనమ్మకాలతో వుండేవాళ్ళు... వాళ్ళే చులాగ్గా, అలవోగ్గా ముగ్గురు, నలుగురు పిల్లల్ని పెంచుతున్నారు. నువ్వు పెంచలేవా? నువ్వేం సందేహాలు పెట్టుకోకు. నీలో ఆ శక్తి వుంది" అన్నాడు.

చందూ చెప్పినంతసేపూ నిజంగానే నాకేవో అతీతశక్తులు వచ్చిపడిపోయినట్లుగా అన్పించింది. యిక ఆ తర్వాత వ్యతిరేక ఆలోచనల్ని పారదోలి మా యిద్దరి జీవితాల్లోకి కొత్త శోభని తీసుకువచ్చే చిన్నారికోసం ఎదురుచూడటం ప్రారంభించాను.

నా డెలివరీ టైమ్‌కి అమ్మ యిక్కడికి వచ్చింది. హాస్పిటల్లో సుఖప్రసవం అయి పాప పుట్టింది. మూడో రోజునే యింటికి వచ్చేశాం.

పాప పుట్టిన వెంటనే చందూ నా దగ్గరకి వచ్చి "అన్నీ నీ పోలికే అంటున్నారు..." అని అలిగినట్లు మొహం పెట్టాడు. అది చూసి నవ్వొచ్చింది. అంతే...! యిక అదే మనస్ఫూర్తిగా నవ్వడం... తర్వాత అంతా కంగారూ, భయాలతోనే రోజులు గడుస్తున్నాయి. పాపని ఎత్తుకోవడం, మాటిమాటికీ పక్క తడుపుతుంటే మార్చడం, వాటిని వుతకడం యివన్నీ అమ్మా, నేనూ చేసేవాళ్ళం.

దానికితోడు యింటిపని అంతా చేయాల్సి రావడంతో అమ్మకి కూడా కష్టంగా వుండేది. ఎక్కువ అలిసిపోయినట్లుగా వుండేది.

అందుకే చాలావరకూ పాప పనులు నేనే చేసుకోవాలనుకునేదాన్ని. కానీ పగలంతా నిద్రపోయే పాప రాత్రయ్యేసరికి మేలుకుని అయిందానికీ, కానిదానికీ రా.గాలు తీసేది. ఒకోసారి ఎందుకే దుస్తుందో తెలీక బెంబేలెత్తిపోయే దాన్ని.

రాత్రిళ్ళు నిద్ర చాలక కంటి కురుపులులేచాయి. డెలివరీ అయ్యాక వచ్చే కొన్ని రకాలయిన శారీరక మార్పుల వల్ల డిప్రెసివ్‌గా వుండేది. మాతృ గర్వం, పులకరింతల స్థానంలో నిస్సహాయత, భయం చోటు చేసుకున్నాయి.

పాపకి చిన్నమెత్తు యిబ్బంది కూడా కలగకుండా చూసుకోడానికి నేను సర్వశక్తులూ ఒడ్డాల్సి వస్తోంది.

ఓరోజు రాత్రి పన్నెండింటి వరకూ యిలాంటి పనులతోనే అలిసిపోయి అప్పుడే నిద్రలోకి జారాను. యింతలో పక్కనే ఉయ్యాల్లో వున్న పాప కయ్యిన రాగం అందుకుంది. చెవులకి ఏడుపు వినబడుతోంది. కళ్ళు విడివడటం లేదు. ఒళ్ళంతా నిస్సత్తువగా వుంది. లేవాలనుకుంటున్నాను లేవలేకపోతున్నాను... ఆ పరిస్థితికి తలలోని రక్తనాళాలు చిట్లిపోతాయా అన్నంత టెన్షన్‌గా వుంది. నిద్ర ఎంత విలువైందో తెలిసివస్తోంది.


పాప ఏడుపు మరింత అధికం అయింది. నెమ్మదిగా కళ్ళు విప్పి పక్కకి చూశాను. అమ్మ ఆదమరిచి నిద్రపోతోంది. రెండుమూడు సార్లు పిలిచాను. నిద్రలో వినబడలేదామెకి.

పక్క గదిలోంచి చందూ లేచి రావడం మూసుకుపోతున్న నా కళ్ళకి అస్పష్టంగా కన్పించింది.

"ప్రశాంతీ...!" నా బుగ్గమీద తడుతూ లేపబోయాడు. లేవలేకపోయాను... చందూ గది నుంచి బైటకి వెళ్ళిపోయాడు.

ఇక పడుకునేపుడు వాళ్ళ నాన్న పొట్టమీద కాళ్ళూ, చేతులూ వడేసి అతని హృదయ సామ్రాజ్యానికి తనే బుల్లిరాణి అన్నంత దర్జాగా నిద్రపోయేది. ఒకోసారి వాళ్ళ నాన్న పొట్ట నిమురుతూ "నాన్నా! నేను అమ్మ పొట్టలోంచి కాకుండా నీ పొట్టలోంచి వచ్చివుంటే బాగుండేది" అంటుంటే చందూ మురిసిపోవాలో, నన్ను సముదాయించాలో తోచక సతమతమవుతుంటే నాకు ఆనందంతో పాటు అసూయ కూడా కలిగేది.

పాప ఏడుపు మరింతగా పెరిగింది. మూసుకున్న నా కంటి చివర్ల నుంచి నిస్సహాయంగా కన్నీరు జారింది. ఆ సమయంలో... ఆ అసహాయ స్థితిలో పాప ఏడుపు చటుక్కున ఆగింది. డెట్టాల్ సోప్ వాసన ముక్కుపుటాలని తాకింది.



అపుడు ఓ అమృత హస్తం నా తలని మృదువుగా నిమిరింది. ఓ ఆత్మీయమూర్తి ఒడిలో పాప కాళ్ళూ, చేతులూ విదిలిస్తూ ఆడుకుంటోంది. ఆ ఆపద్బాంధవుడు నా చందూ తన గంభీర కంఠంతో లాలిపాట మొదలుపెట్టాడు.

"నా చిన్నారి తల్లికీ
బంగారు వడ్డాణమూ...
నా చిట్టి పాపకీ
ముత్యాల హారమూ...."

ఆ పాట పాపకో నాకో తెలీదు...ఆదమరిచి నిద్రపోయాను.

అంతే...! ఆ రోజునుంచీ వాళ్ళిద్దరి మధ్యా ఓ కొత్త అనుబంధం రూపుదిద్దుకుంది. అలా ఆ రోజు పాపని ఒడిలోకి తీసుకున్న చందూ మరెన్నడూ ఆ బాధ్యతని వదిలి పెట్టలేదు. ఈ పని నేను చెయ్యొచ్చా లేదా అన్న అహాన్ని వదిలి సమస్త సేవలూ పాపకి చేశాడు.

ఇద్దరం ఉద్యోగాలు చేస్తున్నాం, ఇద్దరూ యింటి పనులు చేసుకుంటాం. చివరికి యిద్దరం కలిసి పాపని పెంచుతున్నాం... యిది మా ముగ్గురి మధ్యా మరింత ఆత్మీయతని పెంచింది.

ఇపుడు ఏ పనీ కష్టంగా లేదు. అన్నీ యిష్టంగా ప్రతి క్షణాన్నీ ఆనందకరంగా మలుచుకుంటున్నాం.

నాకిపుడు అన్పిస్తోంది. పిల్లల్ని తల్లి మాత్రమే కనగలదు. కానీ ఎవరైనా, తండ్రయినా చక్కగా పెంచొచ్చు అని.

పాపకి ఆరేళ్ళు నిండాయి. ఎంత వద్దనుకున్నా ఒకోసారి యితరుల పిల్లలతో పోల్చి చూస్తే మా పాప పెంకిగా అన్పించడం మొదలయింది.

ఒక్క క్షణం కుదురుగా కూర్చోదు. కూర్చున్నా, నిల్చున్నా పడుకున్నా కాళ్ళూ, చేతులూ డాన్స్ చేస్తూనే వుంటాయి. ఆఖరికి స్కూల్లో టీచరు కూడా "మీ పాప ఏదన్నా ఆన్సర్ చెప్పేటప్పుడు కూడా డాన్స్ చేస్తూనే వుంటుందండీ....!" అనేసింది.

యిదేం జబ్బో అనుకుని ఓసారి చందూతో అంటే 'అదేం జబ్బు కాదు. పాపలో వున్న చైతన్యానికి చిహ్నం..." అని తెలివిగా చెప్పుకొచ్చాడు.

ఇక పడుకునేప్పుడు వాళ్ళ నాన్న పొట్ట మీద కాళ్ళూ, చేతులూ వడేసి అతని హృదయ సామ్రాజ్యానికి తనే బుల్లిరాణి అన్నంత దర్జాగా నిద్రపోయేది. ఒకోసారి వాళ్ళ నాన్న పొట్ట నిమురుతూ "నాన్నా! నేను అమ్మ పొట్టలోంచి కాకుండా నీ పొట్టలోంచి వచ్చివుంటే బాగుండేది" అంటుంటే చందూ మురిసిపోవాలో, నన్ను సముదాయించాలో తోచక సతమతమవుతుంటే నాకు ఆనందంతో పాటు అసూయ కూడా కలిగేది.

మా పక్కింటి గీతకి రెండో కాన్పులో ఆడపిల్ల పుట్టింది. యిద్దరు పిల్లలూ ముత్యాల్లాగా వుంటారు. యింట్లోంచి చిన్న శబ్దం కానీ అల్లరిగానీ విన్పించేది కాదు. వాళ్ళింటికి ఎపుడన్నా వెళితే పిల్లలు చదువుకుంటూ కన్పించేవారు. అటూ యిటూ గెంతడం, పరిగెత్తడం, దూకడంలాంటి మా పాప విద్యలు

వాళ్ళు అసలు ప్రదర్శించేవారు కాదు.

మా పాప వుందంటే ఎపుడూ వాళ్ళ నాన్న మీదకో, నామీదకో ఎగిరి ఒళ్ళోకి దూకడం... చందూ నడుస్తుంటే అతన్ని పట్టుకుని వేలాడ్డం... లాంటి క్రమశిక్షణా రహిత చర్యలు చేసేది.

"అసలు దీన్ని పెంచే విషయంలో మిమ్మల్ని పాల్గోనివ్వడం పొరపాటయింది. అందుకే యిదిలా తయారయింది. చక్కగా పక్కింటి గీతలాగా నేనే పెంచివుంటే వాళ్ళ పిల్లల్లాగా యిది కూడా బుద్ధిగా వుండేది" అతనికి కోపం వస్తుందని కూడా ఆలోచించకుండా అనేసాను.

చిత్రంగా కోపం తెచ్చుకోలేదతను. నవ్వేసి కూతుర్ని గుండెలకి హత్తుకుని "ఆరోజు నేను నీ కష్టం చూడలేక పాపని ఒళ్ళోకి తీసుకున్నాను. ఆ తర్వాత నుంచీ తెలిసి వచ్చింది. పాప హృదయానికి దారి ఏదో. కన్నతల్లి బిడ్డకి ఏయే సేవలు చేస్తుందో అవన్నీ నేనూ చేశాను. తల్లిదండ్రులిద్దరి బాధ్యతాయుతమైన సేవలు పొందింది కాబట్టి పాపలో అభద్రతా భావంలేదు. అందుకే ఆ చలాకీతనం... అది క్రమశిక్షణ లేకపోవడంగా నీకనిపిస్తోంది. ఆలోచించి చూడు.

మా కొలీగ్స్, మిగతా ఫ్రెండ్స్ అందరూ పిల్లల పనులు చేయడం నామోషీగా ఫీలవుతారు. కానీ వాళ్ళకి తెలీదు వాళ్ళేం కోల్పోతున్నారో!

ఆరోజు పాప "నాన్నా! నేను నీ పొట్టనుంచి వస్తే బావుండును" అని అందంటే అది అల్లరిగానో, వూసుపోక అన్నమాటో కాదు. ఆ మాట వెనుక నామీద పాప పెంచుకున్న ఓ బలమైన బంధం, నమ్మకం కనిపించడం లేదూ..." అంటూ ఆనందంతో కన్నీళ్ళు పెట్టేసుకున్నాడు.

ఈ చర్యతో ఓ వారం శాంతించినా బ్రష్ చేయడానికీ, మంచి నీళ్ళు తాగడానికి పేచీలు పెడుతూ రాగాలు తీస్తున్న పాప పెంకితనాన్ని భరించలేక దాన్ని గట్టిగా కేకలెయ్యమని చందూకి వార్నింగిచ్చాను.

ఓ ఫైన్ మార్నింగ్ సింక్ దగ్గర సదరు తండ్రిగారి కేకలు గట్టిగా వినబడ్డాయి. ఈ పిల్లేమో వంటగదిలో నా వెనుక తచ్చట్లాడుతోంది.

"ఏం చేశావేంటి? నాన్న కేకలేస్తున్నారు? అన్నాను.

"ఏంలేదు లేమ్మా" లయన్ రోరింగ్" అంది పాప.

"ఏంటీ? అర్థంకాక అడిగాను.

"అప్పుడోసారి జూకెళ్ళినప్పుడు చెప్పావుగా! సింహం అడవికి రాజు. గర్జించడం దానికి వుండే లక్షణం. భయపడకూడదు... అదన్న మాట..." అనేసి చక్కాపోయింది.

నాన్న కేకలేస్తే భయపడటం పోయి చమత్కారంగా విషయాన్ని ఎక్కడినుంచి ఎక్కడికో కలిపేసి తనకొచ్చిన ఉపద్రవాన్ని తప్పించేసుకుంది.

ఇక లాభం లేదనుకుని వాళ్ళ తాతగారికి చెప్పి అదుపు చేయమన్నాను. ఓ రోజు పాప మరీ గొడవ చేస్తుంటే చెయ్యెత్తి "అల్లరి చేశావంటేనా? కొడతాను..." అన్నారే గానీ చెయ్యి గాల్లో ఆడుతోంది తప్ప వీపుమీదకి రాదు.

ఇదేమో ఆయన చెయ్యి వంకా, మొహం వంకా మార్చి మార్చి చూసి "ఊరుకోండి తాతగారూ!! మీరు మరీనూ" పెద్దరికంగా అనేసి ఆయన కోపాన్ని పేలపిండిలా ఎగరకొట్టేస్తుంటే ఆయన మాత్రం ఏం చెయ్యగలగారనీ... మొహం వక్కకి తిప్పుకుని ముసి ముసిగా నవ్వుకోవడం తప్ప.



ఈ రకంగా తన చిన్ని ప్రపంచంలో తనకి ఎదురయ్యే సవాళ్ళని అత్యంత సమర్థనీయంగా ఎదుర్కొంటూ చిలుకలు వాలిన చెట్టు మా యింట్లో నడుస్తున్నట్లుగా చైతన్యవంతంగా వుండేది పాప.

ఆరోజు నేను నీ కష్టం చూడలేక పాపని ఒళ్ళోకి తీసుకున్నాను. ఆ తర్వాత నుంచీ తెలిసి వచ్చింది. పాప హృదయానికి దారి ఏదో. కన్నతల్లి బిడ్డకి ఏయే సేవలు చేస్తుందో అవన్నీ నేనూ చేశాను. తల్లిదండ్రులిద్దరి బాధ్యతాయుతమయిన సేవలు పొందింది కాబట్టి పాపలో అభద్రతా భావం లేదు. అందుకే ఆ చలాకీతనం...

ఇలాంటి సమయంలోనే నేను చూసిన ఓ సంఘటన నాకు మా పెంపకం పట్ల నమ్మకాన్ని కలిగించింది.

ఓరోజు గీత వాళ్ళింట్లో వున్న కంప్యూటర్‌లో కొత్త సాఫ్ట్‌వేర్ లోడ్ చెయ్యమని తనకి అది అర్జెంటని ప్లీజింగ్‌గా అడిగితే కాదనలేక ఉదయం పనులన్నీ చందూకి అప్పగించి వెళ్ళాను.

అప్పటికి గీత యింట్లో ఉదయపు పనులతో బిజీగా వుంది. నన్ను సిస్టమ్ దగ్గర కూరోబెట్టి తను పనుల్లో పడిపోయింది. వాళ్ళాయన పేపర్ చదువుకుంటున్నారు. యిల్లంతా చాలా నిశ్శబ్దంగా వుంది. ఎవరి పనుల్లో వాళ్ళున్నారు తప్ప ఎవరూ అనవసరంగా ఒక్కమాట కూడా మాట్లాడటం లేదు.

వాళ్ళాయన కూర్చున్న దగ్గరనుంచి కదలక పోవడమే కాక "గీతా! కాఫీ..." "గీతా! నీళ్ల తోడావా?" అంటూ అడగడం చూస్తుంటే కంపరమెత్తింది.

యింకోపక్క గీత యుద్ధ సన్నాహాల్లో వున్నంత టెన్షన్‌గా వుంది... నిజమే మరి యిద్దరు పిల్లలతో అన్ని పనులూ ముగించుకుని తనూ ఆఫీసుకి వెళ్ళాలంటే ఎంత కష్టం? వర్క్ మధ్యలో ఏదో డౌటొచ్చి అడగడానికి డైనింగ్ రూం వైపు వెళ్ళి అక్కడి దృశ్యాన్ని చూసి తెల్లబోయాను.

గీత కోపంగా కళ్ళు పెద్దవి చేసి వాళ్ళ పాపని భయపెడుతూ "ఊ! పాలు తాగు..." వంటి బిగువున సాధ్యమైనంత కఠినంగా అంటోంది.

"వద్దమ్మా! కడుపు నొప్పిగా వుంది" కడుపు పట్టుకుంటూ భయంగా అంటోంది ఆ పాప.

"కడుపు నొప్పా? గాడిద గుడ్డా? స్కూలు ఎగ్గొట్టడానికి యిదో వంక... తాగు..." జబ్బ దగ్గర గుచ్చి పట్టుకుంటూ అంది గీత.

డైనింగ్ టేబిల్ దగ్గర కూర్చొని టిఫిన్ తింటున్న వాళ్ళ నాన్న, అత్తగారు- "మా కాలంలో అయితేనా... పిల్లలు ఆఁ! అంటే ఆగేవారు. ఓసారి కళ్ళెర్రజేస్తే ఉచ్చ పోసేవారు. యిప్పటి పెంపకాలా...?" పుండు మీద కారం జల్లుతూ అంది.

అప్పటి గీత మానసిక పరిస్థితిని వూహించగలను. కానీ అంత వైల్డ్‌గా రియాక్టవుతుందనుకోలేదు.

పిల్ల వీపు మీదా, చెంపల మీదా ఛెళ్ళు, ఛెళ్ళున చరుస్తూ "ఊఁ! తాగు... లేకపోతే నాన్నకి చెపుతాను..." రౌద్రంగా అంది. అంతే! ఆ పాప మొహంలో విపరీతమయిన భయం!

ముంచుకొస్తున్న ఏడుపుని ఓ చేత్తో నోరు మూసుకుని అదుపు చేసుకుంటూ యింకో చేత్తో గ్లాసందుకుంది.

"ఏంటీ గొడవ...?" ఇన్‌షర్ట్ సరిజేసుకుంటూ వచ్చాడతను. కడుపులో లుంగలు చుట్టుకుంటున్న దుఃఖానికో, భయానికో ఆ పాప తాగిన పాలు భళ్ళున వాంతి చేసుకుంటుంటే అది తుళ్ళి ఆయన మీద పడుతుంటే ఆయన కూతుర్ని నిర్లక్ష్యంగా తోసేస్తూ "ఛీఛీ... వెధవగోల...ఇపుడు మళ్ళీ బట్టలు మార్చుకోవాలి..." అని మొహం కంపరంగా పెట్టి వెళ్ళిపోతుంటే తనకి మరింత పనిని పెట్టినందుకు గీత మళ్ళీ పిల్లని నాలుగు దెబ్బలు వేసింది.

ఆ సంఘటనకి నిశ్చేష్టురాలినయ్యాను. ఆ పాప కళ్ళలోని అపనమ్మకాన్ని, భయాన్ని చూస్తుంటే కడుపులో దేవేసింది. ఆ పాప అన్న చెల్లెని లేపి, మొహం కడిగి మంచి నీళ్ళిచ్చాడు. ఆ బాబు కళ్ళలో చెల్లి పట్ల స్పష్టంగా జాలి కనబడింది. కనీసం ఆ మాత్రం జ్ఞానం అయినా తల్లిదండ్రులకి లేకపోయిందే అన్న బాధ మొదలయింది.

వెనుతిరగబోతుండగా చూసింది గీత. నన్ను చూసి బలవంతంగా నవ్వుతూ- "ఎపుడూ వుండేదే యిది... పిల్లలెపుడూ నాలుగు తగిలితే కానీ తోవలోకి రారు..." అంది.

నిజమా! నాలుగు తగిలితే దోవలోకి వస్తారనుకుంటే దానిపట్ల నిబద్ధతతో కొట్టాలి. అత్తగారి మీద కోపాన్ని, తనలో వున్న అసంతృప్తిని యిలా చూపిస్తే ఎలా? మన సులోని ఆవేదన బైటకి వచ్చేలోపు యింటికి వచ్చేసింది.

అప్పటికే తండ్రి కూతుళ్ళిద్దరూ ఎవరి పనిమీద వాళ్ళు వెళ్ళిపోయారు. నేనూ అన్యమనస్కంగానే కాలేజికి వెళ్ళొ చ్చాను.

పాప స్కూలునుంచి రాగానే గుండెలకి హత్తుకున్నాను.

"ఏంటమ్మా...?" నా మొహాన్ని చూసి ఏదో వుందని కనిపెట్టేసి అడిగింది.

"నేను గానీ, నాన్నగానీ ఎపుడన్నా తిడితే నీకు బాధని పిస్తే కాసేపాగి మాకు చెప్పాలి..." అన్నాను.

"అలాగే. మీకు బాధేసినా నాకు చెప్పండి" అంది.

నవ్వేసి దాని బుగ్గలు ముద్దాడాను. ఏ అరగంట ఆడు కుని ఆటలు బోర్ కొట్టి చదువుకుంటానని లోపలికి వెళ్ళింది.

నేను యింటిముందు గార్డెన్‌లో కలుపు ఉంటే తీస్తు న్నాను. పక్కింటికీ, మాకూ మధ్య పిట్టగోడ ఎత్తు తక్కువ కావడంతో వాళ్ళ కాంపౌండ్ మాకు క్లియర్‌గా కనిపిస్తుంది.

గీత అక్కడ కూర్చుని మొక్కలకి పాదులు చేస్తోంది. యిద్దరు పిల్లలూ ఉదయం జరిగింది మర్చిపోయి స్వేచ్ఛ గా నవ్వుతూ ఆడుకుంటున్నారు.

పిల్లలు ఎంత తేలిగ్గా క్షమించగలరు? నవ్వుకుంటూ తల తిప్పకోబోతుండగా జరిగిందా సంఘటన.

వీధి చివర వాళ్ళాయన కారు కన్పించగానే గీత కంగా రుగా "డాడీ వచ్చేస్తున్నారు...వెళ్ళండి...చదువుకోండి..." అంది. పిల్లలు పెద్దపులి నుంచి తప్పించుకోవాలన్న భయంతో పరుగులు పెట్టారు. ఆ హడావుడిలో బాబు కాలికేదో తట్టుకుని బొక్కబోర్లా ముందుకు పడ్డాడు. వరం డా అంచు నుదుటికి తగిలింది. నుదుటినుంచి రక్తం కార డం స్పష్టంగా కన్పిస్తోంది.

అయ్యయ్యో! అంటూ నడవబోయాను. కానీ ఆ బాబు లేచి చేతిని అడ్డు పెట్టుకుని దెబ్బ కనపడకుండా ఉండేలా ప్రయత్నిస్తూ వరండాల్లో వున్న చాపమీద కూర్చుని పుస్తకాలు తెరిచాడు. చిన్న శబ్దం కూడా గొంతు నుంచి రానివ్వలేదు. వాళ్ళ నాన్న వచ్చి చదువుకుంటున్న పిల్లల్ని సంతృప్తిగా చూసి లోపలికి వెళ్ళిపోయాడు. అపు డు చెయ్యి తీసి దెబ్బ చూసుకున్నాడు. రక్తం చూడగానే ఏడుపొచ్చినట్లుంది. గుడ్లనీళ్ళు గుడ్లకుక్కుకుంటూ చదువు తున్నాడు.

నివ్వెరపోయి చూస్తుండిపోయాను. చెయ్యి కొంచెం గీసుకుంటేనే హంగామా చేసే మా పాప, చందూ గుర్తొ చ్చారు. యింతలో చందూ వచ్చిన సూచనగా బైక్ హారన్ వినిపించింది. లోపల హోంవర్క్ చేసుకుంటున్న మా పాప గెంతుతూ వరండా మెట్లు దూకుతూ వచ్చి నాన్నని చుట్టుకుపోయింది.

గోమాతా, లేగదూడల్లా పరస్పరం నిమురుకునే ప్రక్రి య పూర్తయ్యాక నవ్వుతూ నా వైపు చూశాడు చందు. పితృత్వపు గొప్పతనాన్ని చవిచూస్తున్న అతనికి యిక పాప గురించి చెప్పేందుకేముంది?! ఈ బంధాలు యిలా బలపడాలని కోరుకోవడం తప్ప. •

# 'నిషిద్ధాక్షరి'కి ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు

ఆధునిక కవిత్వానికి ప్రతిష్ఠాత్మకమైన "ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు" 2004 కు గాను ప్రముఖ స్త్రీ వాద కవయిత్రి "మందరపు హైమవతి" 'నిషిద్ధాక్షరి' కవితా సంపుటి ఎంపికైందని అవార్డు వ్యవస్థాపకులు రాధేయ ఒక ప్రకటనలో తెలియ జేశారు. ఈ అవార్డు న్యాయనిర్ణేతలుగా డా॥ పాపినేని శివశంకర్, డా॥ ఎండ్లూరి సుధాకర్, ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ వ్యవహరించారు. ఈ అవార్డు పొంది నవారిలో వీరు పదిహేడవవారు.

"ఎన్నాళ్ళ ఈ పూర్వకాలపు పాదాలు
మనసును గుర్తించలేని పాతకాలపు భావాలు
అందరం కలిసి ఈ జీవితం సిలబస్ మార్చలేమా" అంటూ ఆకాశంలో సగమైన స్త్రీలపక్షాన ఆర్తిగా పలికిన కవిత్వమే 'నిషిద్ధాక్షరి'గా న్యాయనిర్ణేతలు పేర్కొన్నారు.

# పెద్దింటి అశోక్‌కు 'యువ పురస్కారం'

ప్రముఖ కథకుడు పెద్దింటి అరుణ్‌కుమార్‌ను 2005 'యువ పురస్కారం' కోసం భారతీయ భాషా పరిషత్, కలకత్తా వారు జాతీయ స్థాయిలో ఎంపిక చేశారు. జాతీయ స్థాయిలో నలుగురు యువ రచయితలకు ఈ పురస్కారాలు లభించగా, తెలంగాణా కథకునిగా అశోక్‌కు ఈ అరుదైన అవార్డు లభించింది. అస్సామి యువ రచయిత మౌసమి ఖండలి, గుజరాతీ రచయిత నబనీత్ జానీ, హిందీ రచయిత పంకజ్ మిశ్రాలు ఈ అవార్డులకు ఎంపికయ్యారని భారతీయ భాషా పరిషత్ డైరెక్టర్ మమతా కాలియ తెలిపారు. ఈనెల 27వ తేది ఆదివారం కలకత్తాలో జరిగే కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందజేస్తారు. గతంలో 'వలస బతుకులు', 'ఊటబాయి' కథా సంకలనాలు, 'దాడి' నవల 'ఎడారి మంటలు' నవ లలు రచించిన అశోక్‌కుమార్‌కి ఇప్పటివరకు వట్టికోట ఆళ్వారుస్వామి అవార్డు, విశాలసాహితి అవార్డు, కథాకోకిల అవార్డు, సురమౌళి మాండలిక కథా పుర స్కారం వచ్చాయి. •

